


నేటి ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : విజయనగరం | శుక్రవారం 06-11-2026 | చీఫ్ ఎడిటర్ : కె వి ఎల్ ఎస్ బాలసుబ్రహ్మణ్యం | సంపుటి : 1 | సంచిక : 106 | పేజీలు : 4 | వెల : 2.00



ఉదయం బ్యూరో చీఫ్
(ఎలిశెట్టి సురేష్ కుమార్)

విజయనగరం మేయర్ ఎన్నిక..ఆమాటకొస్తే మొత్తం మునిసిపల్ ఎన్నికల్లో కూటమి గెలుపు పూర్తిగా అదితి గజపతి రాజు క్రెడిట్.. కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య మేయర్..కార్పొరేటర్ టికెట్ల విషయంలో ఏర్పడిన బేధాభిప్రాయాలను సమర్థంగా పరిష్కరించి మూడు పార్టీల నేతలను ఒక తాటిపైకి తెచ్చి మొత్తం అరవై రెండు డివిజన్ల అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థిని ఖరారు చేసి ఎన్నికలకు వెళ్ళిన తీరు ప్రశంసనీయం. అలాగే ఎన్నికల ప్రచారం..కూటమిలో అక్కడక్కడ మిగిలి ఉన్న లొల్లి..సొంత పార్టీలో కొన్ని పక్క చూపులు..ప్రత్యర్థుల ప్రలోభాలు..క్రాస్ ఓటింగ్ భయాలు..వీటన్నిటి విషయంలో ఆమె చూపిన సమయస్ఫూర్తి..టైమింగ్..ధైర్యం..అంకితభావం..అన్నీ అచ్చం అశోక్ గజపతి మాదిరే..తండ్రి అశోక్ గజపతి పరోక్షంలో ఎదుర్కొన్న మొదటి పరీక్షలో తండ్రి వ్యూహాలను అనుసరిస్తూ ఆమె నడిపిన ఎన్నికల యాత్ర జైత్రంగా ముగియడం తెలుగుదేశం పార్టీకి..కూటమి భాగస్వామ్య పక్షాలకు మాత్రమే గాక నగరం మొత్తానికి దిల్ ఖుష్ అయింది.ప్రత్యర్థి అన్ని విద్యల్లో ఆరితేరిన ఘరానా పెద్ద మనిషి..అంతటి అశోక్ గజపతినే 2004 ఎన్నికలలో చిత్రవిచిత్ర పన్నాగాలతో ఓడించిన వ్యక్తి..ఇప్పుడు ఆయనకు అలాంటి అనుభవాలు మరింత పెరిగాయి..అర్ధబలం ఇంతకు ఇంతయింది..అయ్య శిష్యరికంలో అన్నీ ఒంటబట్టించుకున్న కూతురు జత కలిసింది.ఆ వెనక జామాత జత కలిశాడు..చాలా జరిగాయి..అన్నీ పటాపంచలయ్యాయి.విజయనగరం ధర్మపక్షాన నిలిచింది..అదితి గెలిచింది.!

అంతకు ముందు సొంత పార్టీలో మేయర్ అభ్యర్థిత్వం కోసం జరిగిన గడబిడను ఎదుర్కొని అదితి తీసుకున్న నిర్ణయం కూడా భార్గవి ఘనవిజయంతో కరెక్ట్ అని రుజువైంది.మేయర్ టికెట్టును తన సతీమణికి కట్టబెట్టాలని పట్టుబట్టిన కంది మురళీ తానుగా గెలవలేకపోయాడు.ఇక కరణం సూర్యతేజ తానే....కన్ను లొట్టపోయిన చందంగా గట్టెక్కాడు.ఈ ఇద్దరినీ కాదని నమ్మి టికెట్ ఇచ్చిన అవనాపు విజయ్ తాను విజయం సాధించాడు.

ఇక మేయర్ గా భార్గవి గెలుపు అదితి నిర్ణయంపై..ఆమె రెండున్నరేళ్ల పాలనపై.. విజయనగరం ప్రజల గొప్ప తీర్పు..! వాట్ నెక్స్ట్..తదుపరి ఏంటి?డిప్యూటీ మేయర్ ఎన్నిక..ఈ విషయంలో

ఇక ప్రతిపక్షం బెడద ఉండదు గాని..మళ్ళీ కూటమిలో కొంత కిరికిరి ఏర్పడే అవకాశం ఉంటుంది.ఇప్పుడే అదితి మరింత బ్యాలెన్సింగ్ గా వ్యవహరించవలసి ఉంటుంది.మేయర్ పదవి తెలుగుదేశం పరమైంది గనుక డిప్యూటీని భాగస్వామ్య పక్షానికి ఇవ్వడం సముచితం.

ఈ పదవి బిజెపి నుంచి రవ్వా శ్రీనివాస్ తన సతీమణి మంజుకి దక్కాలని భావిస్తున్నారు.అయితే మొన్ననే స్వామి శిబిరం నుంచి వచ్చిన..అదే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని విషయంలో చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రవ్వా శ్రీనివాస్ కు ఇంకా స్వామితో వ్యాపార భాగస్వామ్యాలు కొనసాగుతున్నాయని అనుకుంటున్నారు.అంతేగాక రవ్వాకి వైసిపి నేత..మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణితో కూడా చాలా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని..అవి ఎప్పటికీ తెగేవి కావని పెద్ద టాకే నడుస్తోంది.

ఇకపోతే అదితి ఇప్పుడు ప్రధానంగా ఆలోచించవలసింది కాపు సామాజిక వర్గం విషయంలో..అదితి హయాంలో అనే కాదు అశోక్ జమానా నుంచి కూడా కాపులు బంగ్లా ఆధిపత్యం విషయంలో అసంతృప్తితో ఉన్నారు.మొన్న కూడా కాపు సామాజికవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు మేయర్ అభ్యర్థిత్వం ఆశించినా దక్కలేదు. ఇప్పుడు తెలుగుదేశం అనే గాక కూటమిలో..నగరంలో కాపులను తన నాయకత్వం వైపు ఆకట్టుకునే అవకాశం అదితికి డిప్యూటీ మేయర్ పదవి రూపంలో కాచుకుని ఉంది. విజయనగరంలో అవనాపు..గురాన కుటుంబాలకు వ్యాపారపరంగా.. రాజకీయంగా కూడా మంచి పేరు.. పలుకుబడి ఉన్నాయి.నిజానికి గురాన సాధూరావు, అవనాపు సూరిబాబు ఇద్దరూ మొదట్లో అశోక్ గజపతి వెంట నడిచిన వారే.. కాలగమనంలో ఆ ఇద్దరూ తెలుగుదేశం పార్టీకి దూరం అయినా ఆ కుటుంబాల నుంచి అవనాపు విజయ్ నేరుగా తెలుగుదేశంలోకి..గురాన అయ్యలు జనసేనలోకి వచ్చి మొత్తానికి కూటమి రూపంలో గురాన..అవనాపు కుటుంబాలు మళ్ళీ అశోక్ బంగ్లాకు చేరువయ్యాయి.

భార్గవిని మేయర్ చేసి అవనాపు కుటుంబానికి అదితి పెద్ద గుర్తింపే కల్పించారు..ఇక గురాన కుటుంబం..నిజానికి ఆ కుటుంబం నుంచి మీసాల గీతను అశోక్ ఎమ్మెల్యే చేసినా అదితి రాకను..నాయకత్వాన్ని జీర్ణించుకోలేని గీత మొదట బంగ్లాకి.. తర్వాత పార్టీకి..మొన్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనాలకి.. రాజకీయాలకు దూరం అయిపోయారు.

ఇక మిగిలింది అయ్యలు..తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన అయ్యలు రాజకీయంగా సీనియర్ అయినా గాని చాలాకాలంగా పదవి రూపంలో తగు గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు.ఆయన తండ్రి సాధూరావు సైతం వ్యక్తిగతంగా ఎంతో మంచి పేరున్న వ్యక్తి అయినా గాని కౌన్సిలర్ పదవిని దాటి మీదకు వెళ్లలేదు.ఒక్కోసారి అయ్యలును పదవి వరించే అవకాశం వచ్చినా ఏదో ఒక రూపంలో అక్కలు ఎగరేసుకు పోయారు.

ఆ అక్కలు కూడా అయ్యలు పట్ల కృతజ్ఞతా పూర్వకంగా వ్యవహరించిన సందర్భాలు లేవు.

జనసేనాని.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు సన్నిహితుడైన అయ్యలుకు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఒక స్థాయి గుర్తింపు ఇవ్వడం అనేది ఇప్పుడు అదితి చేతిలో ఉంది.. అయ్యలుకి గుర్తింపు ఇవ్వడం ద్వారా అదితి జనసేన అనే కాదు కూటమిలోని కాపులను సంతృప్తి పరిచినట్టు కాగలుగుతుంది.ఇటీవలే చిన్న శ్రీను తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తర్వాత ఆయన చుట్టూ తిరుగుతున్న కాపులను మళ్ళీ తన శిబిరానికి చేర్చుకోవడం అనే పెద్ద టాస్క్ లో అయ్యలుకి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా అదితి కొంత మేరైనా కృతకృత్యులు కావొచ్చు.!

కొసమెరుపు..ఇటీవల మున్సిపల్ ఎన్నికల టికెట్ల విషయంలో అయ్యలు కొంత లొల్లి చేసి ఉన్న మాట నిజమే..అయితే చివరి నిమిషంలో వెనక్కి తగ్గి కూటమి అభ్యర్థుల విజయానికి..ముఖ్యంగా మేయర్ అభ్యర్థి భార్గవి గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేశారు.ఇప్పుడు అయ్యలుకి గుర్తింపు ఇస్తే అదితి తన ఉదార గుణాన్ని, రాచరిక స్వభావాన్ని ఘనంగా చాటుకున్నట్టు అవుతుంది.

అంతేగాక తనను వ్యతిరేకించిన గీతను కూడా ఒక్క గిల్లు గిల్లినట్టు కాగలుగుతుంది.చివరగా స్వామికి అస్సలు నప్పని..పొడ కిట్టని అవనాపు విజయ్.. గురాన అయ్యలు కుటుంబాలకు ఒకేసారి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా ప్రజలకు చక్కని సందేశం ఇచ్చినట్టు అవ్వడమే గాక ప్రత్యర్థి స్వామిపై ఇంకో సైక"లాజికల" విజయం సాధించినట్టు కాగలుగుతుంది.

గంట్యాడలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కొండపల్లి



ఉదయం ప్రతినిధి – విజయనగరం

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.గంట్యాడ మండలం గంట్యాడ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద మంత్రికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రజాస్వా మ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న గొప్ప ఆయుధమని, దానిని వృధా చేసుకోవద్దని సూచించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన లభి స్తోందని, ఈ ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

వెంకంపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే విజయచంద్ర, సతీమణి అనూష

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఆయన సతీమణి అనూష తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెంకంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే విజయచంద్ర దంపతులు ఓటు వేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ధీమాను ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.



ప్రాదేశిక ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు

ఉదయం ప్రతినిధి – పార్వతిపురం

పార్వతిపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు గురువారం జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో భాగంగా బలిజిపేట మండలం చిలకలపల్లి తన స్వగ్రామంలో కుటుంబంతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగినది.

పెరిగిన పరిషత్ పోలింగ్ శాతం



ఉదయం ప్రతినిధి – విజయనగరం

జిల్లాలో పరిషత్ పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు నమోదైన పోలింగ్ శాతం జిల్లా వ్యాప్తంగా 71.19 శాతం. ఇది మరో ఒకటి రెండు శాతానికి పెరిగే అవకాశం ఉంది. మొత్తం జిల్లా వ్యాప్తం గా 12 లక్షల 85 వేల 692 ఓటర్లు ఉండగా వీరిలో తొమ్మిది లక్షల 15 వేల 321 మంది ఓటు హక్కును వి ని యోగించుకున్నారు. వీరిలో పురుషులు నాలుగు లక్షల 39వేల 539 మంది ఉండగా మహిళలు నాలుగు లక్షల 75 వేల 779 మంది ఉన్నారు. మొత్తం మీద మహిళలే అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం గమనించదగ్గ విషయము. జిల్లాలోని మండలాలను గమనిస్తే అత్యధికంగా నెల్లిమర్ల మండలం 82.23 శాతం, బొండపల్లి 80.99శాతం, లక్కవరపుకోట 80.40శాతం పోలింగ్ నమోదయ్యాయి. విజయనగరం మండలం 79 శాతం పోలింగ్ నమోదు అయింది.

స్వల్ప ఉద్రిక్తత..!

పరిషత్ పోలింగ్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగానే ముగిసింది. అయితే విజయనగరం మండలం గొల్లలపేట గ్రామంలో మాత్రము స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ గ్రామంలో ఎంపీటీసీ స్థానానికి కూటమి తరపున జన సేన పార్టీకి కేటాయించారు. అయితే తెలుగుదేశం పార్టీ కి చెందిన నాయకులు స్వతంత్ర అభ్యర్థిగా రెబెల్ గా పోటీ చేశారు. ఆ అభ్యర్థికి ఏసీని ఎన్నికల గుర్తుగా కేటా యించడం జరిగింది. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి ధర్మానికి విరుద్ధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో జనసేనకు చెందిన నాయకులు గురాన అయ్యలు, పాలవలస యశస్విని, విక్రములు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని పోలీసులు సరిదిద్దారు.

పోటెత్తారు..!

గ్రామీణ జనం పరిషత్తు ఎన్నికల పోలింగ్ కు పోటెత్తారు. ఈ కారణంగానే పోలింగ్ శాతం పెరిగింది. పురపాలక ఎన్నికలతో పోలిస్తే పరిషత్ ఎన్నికలలో పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం కనిపించింది. ఇందుకు గాను ఎక్కడెక్కడి వారు వచ్చి ఓటు వేయడమే కారణంగా చెప్పవచ్చు. పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి తాలూకు

గొల్లలపేటలో స్వల్ప ఉద్రిక్తత..!


నాయకులు తమ బంధువులను స్నేహితులని పిలిపించి మరి ఓటు వేయించడంతో పోలింగ్ శాతం పెరిగిందని భావిస్తున్నారు. ఆయా గ్రామాలకు వెళుతున్న ఓటర్లతో ప్రధాన రహదారులన్నీ రద్దీగానే కనిపించాయి. కొంత మంది ఓటర్లు విశాఖపట్నం నుంచి సుదూర ప్రాంతాల నుంచి కూడా రావడం కనిపించింది. మొత్తం మీద గ్రామీణ ప్రజలు ఆసక్తిగా పోలింగ్ లో పాల్గొన్నారు.

ఎవరి లెక్క వారిది..!

పోలింగ్ పూర్తవడంతో రాజకీయ పక్షాలు అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం తగ్గిన పురపాలన ఎన్నికలతో చూస్తే పెరిగినట్లే కనిపిస్తోంది. పెరిగిన పోలింగ్ శాతం దృష్టిలో పెట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రవ్వంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రభావం తమ అభ్యర్థుల ఫలితాలపై ఉండవచ్చునా అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. పురపాలన ఎన్నికలలో పోలింగ్ శాతం తగ్గింది. ఎందుకంటే ఎక్కడెక్కడివారు ప్రత్యేకంగా వచ్చి ఓటు వేయలేదు. దీనివల్ల స్వల్పంగానే పోలింగ్ శాతం నమోదు అయింది. ఫలితాలలో దీనివల్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అక్కడో ఇక్కడో కొన్ని సీట్లు కలిసి వచ్చాయి. పోలింగ్ శాతం పెరిగితే ఎక్కడెక్కడ వారు ఓటు వేస్తారు కాబట్టి ఈ అవకాశం ఉండకపోవచ్చు అన్న అంచనాకు వచ్చారు. ఎవరి అంచనాలు ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ మరో రోజులో ఫలితాలు వెల్లడి కానున్నాయి. అంతవరకు ఎదురుచూడాల్సిందే.

సీఎం చంద్రబాబు కేసులపై

హైకోర్టులో కీలక విచారణ



ఉదయం ప్రతినిధి – అమరావతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఉన్న కేసుల్లో సీబీఐ విచారణ జరపాలని వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. పాత్రికేయుడు బాలగంగాధర్ తిలక్, స్కిల్ కేసును సీబీఐకు అప్పగించాలని ఉండవల్లి అరుణ్ కుమార్ వేసిన పిల్‌పై హైకోర్టు విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున వాదనలను సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వినిపించారు. సీఎంను, ప్రభుత్వాన్ని అప్రదిష్ఠపాలు చేయాలని సీబీఐ దర్యాప్తును కోరుతున్నారని రోహత్గీ వాదనలు వినిపించారు. కనీస ఆధారాలు లేకుండా ప్రజాహిత వ్యాజ్యం వేశారని తెలిపారు. తాము విచారించదగిన కేసులు కావని సీబీఐ, ఈడీ అఫిడవిట్‌లు వేశాయని ప్రస్తావించారు. ఆధారాలు లేవంటూ సిట్ ఏసీబీ కోర్టులో తుది నివేదిక జారీ చేసిందని పేర్కొన్నారు. వాటిని ఆమోదిస్తూ ఏసీబీ కోర్టు కేసులను మూసివేసిందని తెలిపారు. ఈ పిల్‌ను నిరర్థకమైనదిగా ప్రకటించాలని న్యాయస్థానాన్ని ముకుల్ రోహత్గీ కోరారు. ఖర్చులు విధించి ఈ పిల్‌ను కొట్టివేయాలని ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టులో ఇరువైపుల వాదనలు ముగిసిన అనంతరం.. ఈ కేసుల వివరాలను పట్టిక రూపంలో ఉంచాలని సీఐడీకి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణను మంగళవారానికి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

వీరేష్ చంద్రదేవ్ గెలుపు నల్లేరుపై నడక



- 7 వేల పైబడి మెజారిటీపై అంచనాలు
- కురుపాం మైదాన ప్రాంతాల్లో మరింత ఆదరణ

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

స్థానిక పోరు ముగిసింది. మన్యం జిల్లా పరిధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముగిసాయి. బ్యాలెట్ బాక్స్ లో అభ్యర్థుల భవిత భద్రంగా ఉంది. ఇక ఎగ్జిట్ పోల్స్ లో వివిధ రాజకీయ పార్టీలు తలమునకలైనాయి. బూతుల వారీగా తమ పార్టీ అభ్యర్థికి దక్కిన ఓట్లు వైరి వర్గాల సాధ్యసాధ్యులపై ఎవరికి వారే అంతనాలు వేసుకుంటూ లెక్కలు కట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 శాతం పైబడి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కడపటి సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో కురుపాం జడ్పిటిసి ఎన్నిక మరింత ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇక్కడ తెదేపా అభ్యర్థి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ పరిస్థితులు అనుకూలిస్తే భవిష్యత్తు జడ్పీ చైర్మన్ కాబోయే వ్యక్తి కావడంతో మరిన్ని అంచనాలు పెరిగాయి. తెదేపా తరఫున కురుపాం జడ్పీటీసీ స్థానం నుండి పోటీ చేస్తున్న వీరేశ్ చంద్ర దేవ్ గెలుపు నల్లేరుపై నడక మాదిరి కనిపిస్తుంది. నామినేషన్ల పర్వానికి ముందే ఒక విడత తర్వాత మరో రెండు విడతలు వీరేష్ చంద్ర దేవ్ మండలంలోని అన్ని ఎంపీటీసీ సెగ్మెంట్లలో తన ప్రచారాన్ని ముమ్మరం చేయడం ద్వారా శ్రేణులను గిరిజనులను స్థానిక నాయకులను అప్రమత్తం చేసుకుంటూ వచ్చారు. పనిలో పనిగా అక్కడక్కడా ఉన్న లోటుపాట్లను సరి చేస్తూ స్థానిక నాయకత్వానికి గాడిలో పెడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలవపాతం చేయడం కలిసొచ్చే అంశం. అందుకు అదనంగా మండలంలో మేజర్ పంచాయతీ, మండల కేంద్రం కురుపు ఓటర్లు ఏకపక్షంగా ఆయనకు మద్దతు తెలపడం మరింత బలం చేకూర్చినట్లు అయ్యింది. దాదాపుగా 65% పోలింగ్ జరగడం అది మైదాన ప్రాంతంలో ఓటింగ్ సరళి పెరగడం వెరసి వీరేష్ చంద్ర దేవ్ కు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. ఇలా ఏ విధంగా చూసుకున్న రాజకీయ కురువృద్ధులు, మేధావులు అంచనాలు వేస్తూ ఎంత లేదన్న ఏడు వేల పైబడి మెజారిటీ వస్తుందన్న నమ్మకాన్ని క్యాడర్లో కలిగించడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా జరిగిన 15 జడ్పిటిసి ఎన్నికలలో దాదాపుగా 12 స్థానాలు పైబడి అధికార కూటమి వర్గాలు చేజిక్కించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మిగిలిన మూడు చోట్ల వైసిపి తన ఉనికి కాపాడుకునే పరిస్థితులు తేటతెల్లమవుతాయని జ్యోతిష్యం చెబుతున్నారు. ఏది ఏమైనా జిల్లా పరిషత్ చైర్మన్ స్థానం తెదేపా కైవసం చేసుకోవడం చూస్పష్టం. రేపటి ఓట్ల లెక్కింపు కార్యక్రమం ముగింపుతో ఫలితాలపై స్పష్టత రానున్నది.

బాలికల అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

- విద్యార్థులతో మమేకం.. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా
- పలు సూచనలు చేసిన కలెక్టర్ డాక్టర్ ఎం. ప్రభాకరరెడ్డి




ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకరరెడ్డి గురువారం తన పర్యటనలో భాగంగా గరుగుబిల్లి మండల కేంద్రంలోని బాలికల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజన వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? భోజనం నాణ్యత ఎలా ఉంది? ప్రతిరోజూ నిర్ణీత మెనూ అమలు చేస్తున్నారా? అనే అంశాలపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహం గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన పరిస్థితులను, పరిసరాలను గమనించారు. వంటగదిని సందర్శించి ఆహార పదార్థాల నిల్వ, వంటకాల తయారీ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతతో పాటు పోషక విలువలు కలిగి ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, పోషకాహారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, నాణ్యమైన పోషకాహారం అందించడం ప్రభుత్వ విద్యా సంస్థల ప్రధాన లక్ష్యాలని ఈ సందర్భంగా కలెక్టర్ పర్యటన స్పష్టం చేసింది.

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు.. పటిష్ట భద్రత, పకడ్బంది ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణ
- వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా ఎన్. ప్రభాకరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టిందని వెల్లడించారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. అవసరమైన చోట ర్యాంపులు, వీల్‌చైర్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి వారు సులభంగా ఓటు వేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచి ఓటర్లకు అవసర మైన సహాయాన్ని అందించేందుకు సిబ్బందిని నియమించినట్లు వివరించారు.

పటిష్టమైన పోలీసు భద్రతతో ప్రశాంత పోలింగ్

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని భద్రతా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది సమన్వయంతో సజావుగా పోలింగ్ జిల్లాలో ఎన్నికల విధులకు నియమించిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది, పోలీసు శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేపట్టిన చర్యలు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు దోహదపడ్డాయని కలెక్టర్ తెలిపారు.

"చె(చి)త్త" శుద్ధి ఏది...!?

ఉదయం ప్రతినిధి – విజయనగరం




చూసారా...ఇది నగరపాలక సంస్థ తీరు. నగరంలో... రింగ్ రోడ్డు సమీపంలో..టౌన్ లే అవుట్ సెంటర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గరలో... ఎస్ వి ఎన్ నగర్ కు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన ఇదీ దుస్థితి. పెద్ద ఐరన్ డస్ట్ బిన్ తుప్పు పట్టి వదిలేసింది. చెత్త పేరుకుని దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడకి దూరంలో వార్డు సచివాలయం కూడా ఉంది. అలాగే వదిలేశారు. అటువైపు వెళితే కంపే. బాధ్యత ఎవరిది...? పారిశుధ్య సిబ్బందిదా...అధికారులదా... ఉన్నతాధికారులదా... ఇదేనా "చె(చి)త్త" శుద్ధి...పన్నులు వసూలు చేస్తున్నారు..మరి ఇదేమిటి అని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు..?

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారిణి హరిత మృతి.. సీఎం విచారం

ఉదయం ప్రతినిధి – అనంతపురం





ఎన్నికల విధుల్లో విషాద ఘటన చోటు చేసుకుంది. పోలింగ్ అధికారిణి హరిత గౌడ్ (58) మృతిచెందారు. అనంతపురం జిల్లా కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పోలింగ్ విధుల్లో ఉండగా శ్వాసకోశ సమస్యతో హరిత కుప్పకూలింది. హుటాహుటిన కూడేరు పీహెచ్‌సీకి ఆమెను తరలించగా.. చికిత్స పొందుతూ కన్నుమూశారు. డి.హీరాహాల్ మండలం పూలకుర్తిలో మృతురాలు హరిత ఎస్టీటీగా పనిచేస్తున్న విషయం తెలిసిందే.

హరిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు

హరిత మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా కల్పించారు.

పోలింగ్ అధికారిణి హరిత గౌడ్ మృతిపై మంత్రి లోకేశ్ విచారం..

పోలింగ్ అధికారిణి హరిత గౌడ్ మృతిపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న టీచర్ హరిత గౌడ్ గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఆమె అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక మృతిచెందారని తెలిపారు. ఆమె మృతి పట్ల నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా హరిత గౌడ్ కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏపీ సీఎంఆర్ఎఫ్‌కు విట్ యూనివర్సిటీ రూ.కోటి విరాళం

ఉదయం ప్రతినిధి – అమరావతి

ఆర్నబ్, మురసు తుఫాన్‌ల బాధితుల సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం విట్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయలు విరాళంగా అందించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రూ.కోటి డీడీని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ విశ్వనాథన్.. ప్రకృతి విపత్తుల సమయంలో రాష్ట్ర ప్రజలకు అండగా నిలవడం తమ నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు, విపత్తు సహాయం, సమాజ అభివృద్ధి కోసం విట్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విట్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, విట్-ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.

రాప్తాడు బాధితురాలికి శస్త్రచికిత్స విజయవంతం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ఉదయం ప్రతినిధి – అమరావతి



రాప్తాడు ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. బాధితురాలికి వైద్యులు అందిస్తున్న చికిత్స సత్ఫలితాలను ఇస్తోందని, ఆమె ఆరోగ్య పరిస్థితిలో ఆశాజనకమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బాలిక కుడి భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతం కావడం ఉపశమనం కలిగించే విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధితురాలు మంచం నుంచి లేచి కుర్చీలో కూర్చునే స్థితికి వచ్చిందని.. నిలబడేందుకు, నడిచేందుకూ ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన బాధితురాలు క్రమంగా కోలుకుంటుండటంతో కుటుంబ సభ్యుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయి.

సాధారణ స్థితిలో శ్వాస, రక్త ప్రసరణ..

ప్రస్తుతం బాధితురాలు శ్వాసక్రియ, రక్త ప్రసరణ సాధారణ స్థితిలోనే ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. మరోవైపు బాధితురాలు నోటి ద్వారా ఆహారం తీసుకోవడం కూడా ప్రారంభించారని తెలిపారు. ఇది ఆమె కోలుకునే ప్రక్రియలో సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఐవీ ద్వారా అవసరమైన మందులు అందించడంతోపాటు నొప్పి నివారణ చికిత్సను కూడా వైద్యులు కొనసాగిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ.. మరింత త్వరగా కోలుకునేందుకు వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వైద్యుల సూచనలు, పర్యవేక్షణ మధ్య చికిత్స కొనసాగుతుండగా.. బాధితురాలు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి సమీక్షా బృందం పర్యటన

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం మన్యం



జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సమీక్షా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి సమీక్షా బృందం గురువారం జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థలను సందర్శించింది. జిల్లాలో అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును ఈ బృందం క్షేత్రస్థాయిలో సమగ్రంగా సమీక్షించింది. పర్యటనలో భాగంగా రాష్ట్ర సమీక్షా బృందం జిల్లాలో రెండు బృందాలుగా ఒక బృందం జిల్లా ఆసుపత్రి, పార్వతీపురం, డిఈఐసి, సామాజిక ఆరోగ్య కేంద్రం, చినమేరంగి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రావివలసను , వేరొక బృందం సాలూరు ప్రాంతీయ ఆసుపత్రి, మెంటాడ వీధి పట్టణ ఆరోగ్య కేంద్రం, పాంచాలి హెల్త్ వెల్నెస్ కేంద్రాలం లను సందర్శించింది. ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య ఆరోగ్య సేవలు, సిబ్బంది పనితీరు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల పనితీరు, మందుల లభ్యత తదితర అంశాలను అధికారులు కూలంకషంగా పరిశీలించారు. ఆసుపత్రులలో ఎన్‌సీడీ స్క్రీనింగ్, మాతా శిశు ఆరోగ్య సేవలు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల నిర్వహణ, నాణ్యతా ధృవీకరణ సాధనకు సంబంధించిన రికార్డులను, నివేదికలను నిశితంగా పరిశీలించారు. అనంతరం వైద్య ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. లక్ష్య సాధనే ధ్యేయంగా సమీక్ష: జిల్లాలో వైద్య ఆరోగ్య సేవల నాణ్యతను మరింత పెంపొందించడం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. నాణ్యతా ధృవీకరణ లక్ష్యాలను విజయవంతంగా సాధించడమే లక్ష్యంగా ఈ సమీక్షా పర్యటన కొనసాగిందని వెల్లడించారు. ఈ రాష్ట్ర స్థాయి బృందంలో జాయింట్ డైరెక్టర్స్ డా.ఎన్ దేవసాగర్. డా.వై సుబ్రహ్మణ్యం , ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి. ప్రసన్నకుమార్, ఎన్.యు.హెచ్.ఎం కన్సల్టెంట్ జి.వి. వేణుకుమార్ ఉన్నారు. వీరితో పాటు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా పి. విజయలక్ష్మి, డిసిహెచ్ఎస్ డా. నాగభూషణరావు, సూపరింటెండెంట్ డా. నాగశివజ్యోతి, ఆరోగ్యశాఖ అధికారులు డా వై . విజయమోహన్, డా. కెవిఎస్ పద్మావతి, డా టి. జగన్ మోహనరావు, డా. ఎస్.కె హఫీజా , డా. ఎం. రవి కుమార్ రెడ్డి, డా. శివకుమార్, ఆర్ఎంఓ డా.శ్యామల, క్వాలిటీ కన్సల్టెంట్ డా.ఎం. మణికంఠ, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డా డి.రమణ కుమార్, వైద్యులు,వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ ప్రక్రియ

71.97 శాతం పోలింగ్ నమోదు



ఉదయం ప్రతినిధి - మెరకముడిదాం

మండలం లో గురువారం జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ ప్రక్రియ సాయింత్రం 5 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. ఈ సమయానికి వరుసలో నిల్చొని ఉన్న ఓటర్లకు తమ ఓటు హక్కుని వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించిన పోలింగ్ కొద్ది సమయం వరకు మండకొడిగా జరిగినప్పటికి సాయింత్రం 5 గంటల పోలింగ్ ముగిసే సమయానికి 71.97శాతం నమోదు అయ్యింది. కాగా పురుషులు 15133 మంది మహిళలు 16327 మంది ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.

పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ

- ప్రజల సహకారం, పోలీసుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం
- ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

ఉదయం ప్రతినిధి-పార్వతీపురం



పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రశాం తంగా ముగిసింది. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులే కుండా జిల్లా పోలీస్ శాఖ ముందస్తు ప్రణాళికతో తీసుకున్న భద్రత చర్యల వలన చిన్న చిన్న ఘటనలు తప్ప ఎన్ని కలు సజావుగా జరగాయని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలియజేసారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు, నిరంతరం మొబైల్ పోలీసు బృందాల పర్యవేక్షణతో పాటుగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల గకుండా నిరంతరం నిఘా పెడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిఘా ఉంచడంవలన జిల్లా అం తటా సజావుగా ఎన్నికల ప్రక్రియ ముగిసిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రజలకు, ఓటర్లకు, ఎన్నికల అధికారులకు, పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు.

కొటియాపై ఒడిశా తీరు సరికాదు

- ఎన్నికల్లో పాల్గొనకుండా అభ్యర్థుల కిడ్నాప్ సమంజసం కాదు
- ఇది భారత్ పాకిస్తాన్ బోర్డర్ కాదు
- ఏపీలో ఓటు వేస్తే కొడతారా
- కొటియా గ్రామాల నియంత్రణపై ఏపీ మంత్రి



ఉదయం ప్రతినిధి - సాలూరు

ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మధ్య నెలకొన్న కొటియా గ్రామాల వివాదం ఈనాటిది కాదని, స్వతంత్రం రాకముందు నుండి ఉందని, ప్రస్తుతం సుప్రీం కోర్టు స్టేటస్కో అమల్లో ఉందని, అయినప్పటికీ ఒడిశా ఏక పక్షంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, చివరకు అభ్యర్థుల కిడ్నాప్ చేసే స్థాయికి వెళ్లారని ఏపీ మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఉదయం మండలంలోని సారిక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి, ఓటు వేసేందుకు విచ్చేసిన కొటియా గ్రూప్ గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఒడిశా పోలీసులు, అధికారుల బెదిరింపులు, దౌర్జన్యాలు, తమ నాయకుల కిడ్నాప్ గూర్చి వివరించగా, మంత్రి ఘాటుగా స్పందించారు. 21 కొటియా గ్రూపు గ్రామాలు ఏపీ, ఒడిశా రాష్ట్రాల మధ్య ఉన్నాయని, ఈ రెండు రాష్ట్రాలు భారత్ దేశంలో అంతర్భాగమే తప్ప, భారత్, పాకిస్తాన్ మధ్య లేవన్నారు. కొటియా ఓటర్లు ఏపీలో ఓట్లు వేసినట్లు సిరా గుర్తును చూస్తే వారిని కొడతామని బెదిరించడం అమానుషం అన్నారు. ఓటు వెయ్యాకపోతే దండించాలే తప్ప, వేస్తే కొట్టడం ఏమిటని ప్రశ్నించారు.

ఏడాదిగా కృతి మించింది, గిరిజనులను కిడ్నాప్ చేసారు

కొటియా గ్రామాల ప్రజల విషయంలో ఒడిశా అధికారుల తీరు అన్యాయంగా ఉందని, గత ఏడాదిగా ఆయా గ్రామాల ప్రజల(గిరిజనులు)ను చాలా ఇబ్బంది పెడుతున్నారని మంత్రి సంధ్యారాణి విమర్శించారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వారంతా తమ వైపే ఉండాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించారు. వారికి ఎటువైపు ఉండాలని అనిపిస్తే అటే ఉంటారన్నారు. వారికి ఆ స్వేచ్ఛ లేదా అన్నారు. వివాదస్పద గ్రామాలు ఏపీకి చెందుతాయని మేం అనుకుంటున్నాం, కాదు మాకు చేందుతాయని వాళ్లు అంటున్నారు. ఈ విషయాన్ని రెండు ప్రభుత్వాలు చర్చల ద్వారా తేల్చుకోవాలే తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమిటన్నారు. ఎన్నికలు వద్దు అనుకుంటే ఎన్నికల కమిషన్ కి తమ అభ్యంతరాన్ని తెలియజెయ్యాలే తప్ప, ఎన్నికలను అడ్డుకోవటం ఏమిటి, ఇది నేరం అని తెలియదా అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఐదుగురు గిరిజనులను కిడ్నాప్ చేసారని, అందులో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఉన్నారని, ఇంతటి దౌర్జన్యం ఏమిటన్నారు. అమాయక ప్రజలను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశ్యంతోనే తాము సయ్యమనం పాటిస్తున్నామని, వారిలా మేం కూడా వ్యవహరిస్తే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందన్నారు. ఓటు హక్కును వినియోగించుకోనే హక్కును రాజ్యాంగం కల్పించిందని దాన్ని అడ్డుకుంటే ఎలా, ఈ విధానం పై ఒడిశా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటామని, మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.



చెదురుమదురు సంఘటనలు మినహా

పల్లెపోరు ప్రశాంతం

ఉదయం ప్రతినిధి - విజయనగరం

విజయనగరం జిల్లాలో గురువారం జరిగినజడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలు చెదురు,మదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి.జిల్లా వ్యాప్తంగా మొత్తం 449 ఎంపిటిసి స్థానాలకు గాను 11 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 438 స్థానాలకు, 27 జడ్పీటిసి స్థానాల కు గురువారం ఎన్నికలు జరిగాయి. 27 జడ్పీ టిసి స్థానాల నుంచి 103 మంది అభ్యర్థులు, 438 ఎంపిటిసి స్థానాలకు గాను 1,066 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,85,692 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 6,35,994 మంది, మహిళా ఓటర్లు 6,49,661 మంది మరియు ఇతర ఓటర్లు 37 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 388 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగాను, 323 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగాను అధికారులు ముం దుగానే గుర్తించారు. ఈ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ పోలీ సు బందోబస్తును ఏర్పాటు చేశారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి 3,609 బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. ఇందుకై: 54 మంది రిటర్నింగ్ అధికారులను,1,745 మంది ఎ.ఆర్.వోలు, 8,722 మంది పోలింగ్ అధికారులు, 93 మంది జోనల్ అధికా రులు,211 మంది మైక్రో అబ్జర్వ ర్లను నియమిం చారు. ఈ మేరకు 434 వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని చెదురుమదురు సంఘటనలు అక్కడక్కడ జరిగాయి. ఇవి మినహా మిగిలిన ప్రాంతాల్లో గురువారం జరిగిన పల్లెపోరు ప్రశాంతంగా ముగి సింది. జిల్లా లో 74 శాతం పోలింగ్ నమోదైంది. బలిజి పేట మండలం చిలకలపల్లిలో ఉద్రి క్తత చోటు చేసు కుంది. పార్వతీపురం మాజీ ఎమ్మెల్ నాయకుడు అలజంగి జోగారావు సొంత గ్రామం ఇది. ఇక్కడ తెదేపా,వైకాపా పార్టీల కార్యకర్తల మధ్య చిన్నపాటి

74 శాతం పోలింగ్ నమోదు

ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సద్దుమణిగింది. అలాగే విజయన గరం మండలంలోని జొన్నవలసలో తెదేపా,వైకాపా కార్యకర్తల మధ్య చిన్నపాటి తోపులాట జరిగింది. అలాగే గరివిడి మండల కేంద్రంలో వైకాపా, జనసేన కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది.కాగా కొమరాడ మండలం లో నాగావళి నదిని దాటి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేసుకున్నారు. గురువారం వర్షం లేకపోవడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు హాజరై ఓటుహక్కును వినియోగిం చుకున్నారు. గురువారం ఉదయం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల్లో మందకొడి గానే పోలింగ్ మధ్యాహ్నం వరకు జరిగింది.ఆ తరు వాత ఓటర్లు రాక పెరిగింది.ఎక్కడకక్కడ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చదురు గుడి వద్ద నృత్య ప్రదర్శనలు



ఉదయం ప్రతినిధి - విజయనగరం

శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలు కార్యక్రమాలలో భాగంగా గురువారం రాత్రి చెదురు గుడి వద్ద తపస్వి నృత్యాలయ వారిచే కె.పద్మావతి బృందంచే భరతనాట్యం ప్రదర్శన లు జరిగాయి.గణపతి తాళం,గణపతి కౌతం, దుర్గా కౌతం ప్రదర్శించారు.తదుపరి ఎన్ కె.శారద భక్తి సంగీతం.మద్దిలసూరప్పడుచే అన్నమయ్య సంకీర్తనలు గానం చేసారు.

చీపురుపల్లిలో 74.49 శాతం పోలింగ్





ఉదయం ప్రతినిధి - చీపురుపల్లి

చీపురుపల్లిలో 74.49 శాతం పోలింగ్ నమోదు అయ్యిం ది. మండలంలో మొత్తం ఓటర్లు 49, 469 మంది ఉండగా వారిలో 36,851 మంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. మండలంలో 18 ఎంపీటీసీ స్థానాలకు ఒక జెడ్పీటీసీకి గురువారం 55 పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని కలు నిర్వహించారు. పీఓ ఏపిఓలు, ఓపీఓ లు కలిపి 425 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించారు.

చీపురుపల్లిలో మహిళా ఓటర్లదే హవా : చీపురుపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్లదే హవా కొనసాగింది. జడ్పీటీసీ ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో చీపురుపల్లి లో 18,937 మంది, గరివిడిలో 21,033 మంది, గుర్లలో 22,804 మంది, మెరకముడుదాం లో 16,327 మంది మహిళా ఓటర్లు పురుష ఓటర్లు కంటే ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతం కంటే మహిళల్లో పెరిగిన చైతన్యం ఏ పార్టీకి మేలు జరగనుందోనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యులు : చీపురుపల్లి మండలంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షు డు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావులు వారి ఓటు హక్కును వినియోగించు కున్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ : మండల కేంద్రంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య సంరక్షణ శిబిరంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ రక్త పరీక్ష చేయించుకున్నారు. ఆయనతో పాటు డీఎస్పీ ఎస్ రాఘువులు, సిఐ జి శంకరరావు ఎస్సై ఉమా వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఓటర్లకు తప్పని ఇబ్బందులు : చీపురుపల్లి మండలంలో గురువారం జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు కాస్త ఇబ్బంది పడ్డారు. చీపురుపల్లి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద బురద మయం కావడంతో ఓటరు ఇబ్బంది పడ్డారు. అలాగే మండలంలోని అలజంగి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటరు వెళ్ళి వచ్చేందుకు ఒకే ద్వారం కావడంతో అక్కడ కూడా కాస్త తోపులాట జరిగింది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను, ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పక్కా ప్రణాళికతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం : జిల్లా ఎస్పీ
- ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- సజావుగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియ , డ్రోన్ నిఘా, సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల నిరంతర పర్యవేక్షణ

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం



పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహిస్తున్న ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికతో కూడిన పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, తెలిపారు. దీనిలో భాగంగా సీతా నగరం మండలం, నిడగల్లు, బూర్జ, బలిజిపేట మండ లం, అజ్జాడ, చాకరపల్లి, చిలకలపల్లి, రావుపల్లి, అమ్మా వల్లి, బలిజిపేట, చినమేరంగి, ఎం.ఆర్.నగరం ప్రాంతా ల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను, కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రి యను క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి గుంపులు గుమిగూడ కుండా, రాజకీయ పార్టీల కార్యకలాపాల వల్ల ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటు వేయడానికి వచ్చే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు సహా ప్రతి ఒక్కరికీ అవసరమైన సహకారం అందిస్తూ, వారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలని తెలి పారు. ఎన్నికల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ కేం ద్రాలు, పరిసర ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గురువారం పార్వతీపురం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలీస్‌శాఖ నుంచి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి కూడా ప్రజలు వచ్చి వారి ఓటు హక్కును విని యోగించుకుంటున్నారు. ఇప్పటివరకు ఏవిధమైన అవాంచనీయ ఘటనలు జరగకండా సజావుగా పోలింగ్ జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 900 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొ న్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటు వంటి ఇబ్బందులు, శాంతి భద్రత సమస్యలు ఉత్పన్నం కాకుండా అదనపు బందోబస్తు ఏర్పాటు చేయడం జరి గింది. ప్రతి ఆ రూట్స్‌లో కూడా రూట్ మొబైల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. స్ట్రైకింగ్ ఫోర్స్,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్టి బృందాలు ఏర్పాటు చేసి ఎటువంటి శాంతి భద్రత సమస్యలు లేకుండా తిరుగుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీస్ శాఖ అప్రమ త్తంగా ఉంటుందని, ప్రజల భద్రతకు, ఎన్నికలు సజావు నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీతో పాటుగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యంలో తీవ్ర విషాదం

ఎన్నికల డ్యూటీలో గుండెపోటుతో కుప్పకూలిన ఏపీఓ!



ఉదయం ప్రతినిధి – కొమరాడ

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఒక ఉపాధ్యాయుడు అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై నేలకొరిగారు.

పోలింగ్ కేంద్రంలోనే హఠాత్తుగా కుప్పకూలిన అధికారి

స్థానిక నివేదికల ప్రకారం.. టీకే జమ్ము గ్రామానికి చెందిన కొండగొర్రి ప్రసాద్ పొడి గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కొమరాడ మండలం దేవకోన పోలింగ్ కేంద్రం (గ్రూ నెంబర్ 4) లో అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ గా ఎన్నికల విధులకు హాజరయ్యారు. గురువారం ఉదయం పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్న సమయంలో, ప్రసాద్ హఠాత్తుగా తీవ్ర గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.

వెంటనే స్పందించిన సిబ్బంది.. ఆసుపత్రికి తరలింపు

ప్రసాద్ హఠాత్తుగా నేలకొరగడంతో పోలింగ్ కేంద్రంలో ఉన్న ప్రిసైడింగ్ ఆఫీసర్ సంతోషి మరియు ఇతర సిబ్బంది తక్షణమే స్పందించారు. సమయం వృధా చేయకుండా అందుబాటులో ఉన్న ఆటో ద్వారా ఆయన్ను స్థానిక రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ డ్యూటీలో ఉన్న డాక్టర్ అనుప్ రోగిని అత్యవసరంగా పరీక్షించి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే, ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందించడం కోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ తరలింపు సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు రోగికి తోడుగా వెళ్లినట్లు డాక్టర్ అనుప్ మీడియాకు తెలియజేశారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న తోటి ఉద్యోగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో తోటి ఉపాధ్యాయులు, జిల్లా ఎన్నికల సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నడిమికెళ్లలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన స్థానిక సంస్థల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్. చిన్న రాముడు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సంస్థల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్. చిన్న రాముడు తెలిపారు. గురువారం ఆయన వీరఘట్టం మండలంలోని నడిమికెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ప్రవేశం మరియు నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలకులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలింగ్ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు



ఉదయం ప్రతినిధి – గజపతినగరం

మండలంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలను ఎలక్షన్ అధికారులు పోలీసులు ప్రశాంతంగా ముగించారు గురువారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవడం గమనాహారం ఎన్నికల సమయంలో గజపతినగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి .రమేష్ కుమార్ స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కడ కూడా చెదురు ముదురు ఘర్షణలు తప్ప ఎక్కడా కూడా ఎటువంటి సంఘటనలు జరగకుండా కట్టు దిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా ముగించారు మండలంలో కేశీగువ .పాత బగ్గాశీ సెగ్మెంట్ లో బంగారంపేట . జిన్నాశీ సెగ్మెంట్లో రామన్నపేట గ్రామాల్లో చిన్నచిన్న చేదురు ముదురు ఘర్షణలతో తప్ప ఎక్కడ కూడా ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికారుల పి రమేష్ కుమార్. ఈ కళ్యాణి. భరత్ కుమార్. సిఐ సన్యాసినాయుడు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నారు

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పటిష్ట పోలీసు భద్రత

ప్రశాంత వాతావరణంలో పోలింగ్



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

కీలక భద్రతా చర్యలు మార్గదర్శకాలు:

సజావుగా క్యూలైన్ల నిర్వహణ: ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు, క్యూలైన్ల వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేశారు. వృద్ధులు, మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. 100 మీటర్ల పరిధిలో నిబంధనలు కఠినతరం: పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిని నిషేధిత ప్రాంతంగా పరిగణిస్తూ మార్కింగ్ చేశారు. ఆ పరిధిలోకి అనధికార వ్యక్తులు, వాహనాలు రాకుండా బారికేడ్లతో పటిష్ట నిఘా ఉంచారు. చట్టపరమైన నిబంధనల అమలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (వీజజ), పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (దీచీూా) సెక్షన్ 163 (పూర్వపు జత్రీూజ 144) నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారు. గుంపులుగా చేరడం, ప్రచార సామగ్రి ప్రదర్శించడంపై కఠిన ఆంక్షలు విధించారు. సిబ్బందికి దిశానిర్దేశం: విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, ప్రత్యేక బలగాలు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించాలని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సూచనలు జారీ చేశారు. ప్రత్యేక పెట్రోలింగ్: సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్స్ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఎన్నికలు స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఓటుకు పోటెత్తిన గిరిజనం



ఉదయం ప్రతినిధి – గుమ్మలక్ష్మీపురం

స్థానిక సంస్థల ఎన్నికలలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటర్లు ఓటువేసేందుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు.తమ ఓటు హక్కును వినియోగించు కొనేందుకు కొండలు కొనలు వాగులు వంకలు దాటి వచ్చారు.14 ప్రాదేశిక పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 7గంటల నుంచే ఓటుహక్కును వినియోగించుకునేం దుకు బారులు తీరారు. అయితే గతం కంటే ముఖ్యంగా గిరిజన ఓటర్లు చైతన్య వంతులు అయ్యారని చెప్పవచ్చు. ఉదయం 10 గంటలకు 10.29 శాతం పోలింగ్ నమోదవ్వడం విశేషం.

ఓటు హక్కు వినియోగించుకున్న మహాకూటమి జడ్పిటిసి, ఎంపీపీ అభ్యర్థులు



ఉదయం ప్రతినిధి – గజపతినగరం

స్థానిక ఎన్నికలవేళ గజపతినగరం మండలం జడ్పిటిసి అభ్యర్థి రెడ్డి పావని ఎంపీపీ అభ్యర్థి ఆ గంట్యాడ శ్రీదేవి తమ ఓటు హక్కునుమండలం లో మరిపిల్లి పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహా కూటమి జెడ్పిటిసి అభ్యర్థి రెడ్డి పావని . టిడిపి ఎంపీపీ అభ్యర్థి రాష్ట్ర టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు. గంట్యాడ శ్రీదేవి పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు

ఓటేసిన శివరామకృష్ణ



ఉదయం ప్రతినిధి – గజపతినగరం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రణం శివరామకృష్ణ గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గల పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియో గించుకున్నారు. అలాగే అతని కుమారుడు కరణం జై వర్ధన్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా అమెరికాలోని న్యూ జెర్సీ నుంచి రావడం విశేషంగా చెప్పుకోవచ్చు.

భద్రగిరిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ వైశాలి

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు: భద్రగిరి గురుకుల పాఠశాలలో జేసీ పరిశీలన
- భద్రగిరి 26, 27 పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



ఉదయం ప్రతినిధి – గుమ్మలక్ష్మీపురం

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న 26, 27 నంబరు పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి కల్పించిన సదుపాయాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. మంచినీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, కనీస వసతులు సరిగ్గా ఉన్నాయో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారుడ

చైర్పర్సన్ అభ్యర్థి బెలగాం కరుణాకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ 10వ వార్డు కౌన్సిలర్ దివ్య

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



పార్వతిపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి బెలగాం కరుణకు 10వ వార్డు మాజీ కౌన్సిలర్ దివ్య పుష్పగుచ్ఛాను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం సాయంత్రం ఆమె నేరుగా చైర్మన్ అభ్యర్థి కార్యానికి వెళ్లి ఆమెకు పుష్ప కుచ్చులు అందించి సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మాజీ వార్డ్ కౌన్సిలర్ దివ్య మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు కూటమి ప్రభుత్వంపై నమ్మకముతో విశ్వాసంతో పొరపాలక సంఘ అభ్యర్థి చైర్పర్సన్ కు ఓటు వేసి గెలిపించిన ప్రజలందరూ ధన్యవాదములు తెలిపారు. ఎంతటి విజయానికి కారణమైన గౌరవ శాసనసభ్యులు విజయ్ చంద్ర సతీమణి అనూష నిరంతరం వార్డుల్లో అలుపెరగని పోరాటం చేస్తూ చైర్మన్ అభ్యర్థికి కృషి పట్టుదల వల్లే ఈరోజు అకాండ మెజార్టీ గెలుపొందామని ఆమె అన్నారు ఇంతటి విజయాన్ని ప్రజల అందించిన అవకాశాన్ని చైర్పర్సన్ పట్టణ ప్రజలు అభివృద్ధిపై సంక్షేమపై నిరంతరం శ్రమించి ప్రజల నమ్మకాన్ని నమ్మే విధంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

గజపతినగరంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే బొత్స



ఉదయం ప్రతినిధి – గజపతినగరం

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే వైసీపీ సమన్వయకర్త బొత్స అప్పలనర్సయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి గజపతినగరంలో ఉన్న గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న గొప్ప ఆయుధమని దానిని వృధా చేసుకోవద్దని పిలుపునిచ్చారు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా యువ నేత బొత్స సాయి గురు నాయుడు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఆయనతోవైసీపీ సీనియర్ నాయకులు మండల సురేష్. జడ్పిటిసి అభ్యర్థి మండల సూర్య కళ . మండల పార్టీ అధ్యక్షుడు పల్లి సంజీవరావు పాల్గొన్నారు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



జిల్లాలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్‌లోని ప్రత్యేక కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా ఎన్ ప్రభాకర రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, జెడ్పి సిఈఓ సుధాకర్‌తో కలసి పర్యవేక్షించారు. కం ట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని, సిబ్బంది పనితీరును ఆయన ఎప్పటికప్పుడు సమీక్షించా రు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంతమైన, పారదర్శకమైన వాతా వరణంలో పోలింగ్ పూర్తయ్యేలా చూడాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ముఖ్యంగా సున్నిత ప్రాంతాల్లో భద్రతా చర్యల ను నిశితంగా గమనిస్తూ, ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీస్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

Owner,Editor, Publisher : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA, Published from H.NO: 1-19-17, BC COLONY, AGRAHARAM, VIZIANAGARAM, ANDHRA PRADESH - 535004. Printed at NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA , KURNOOL, ANDHRA PRADESH - 518380.
Editor : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA. Registration Number : APTEL/26/A5462